
రాత్రి.. హంస వాహనంపై వీణాపాణిగా


ఉదయం.. వర్షంతో ఘటాటోపం కింద పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

పడగలు ప్రణమిల్లి.. పద్మావతి శోభిల్లి

● హంస వాహనంపై జ్ఞానప్రదాయని

తిరుచానూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్ద శేష, హంస వాహన సేవలు జరిగాయి. ఉదయం శంఖు, చక్ర, గదాధారి అయి పరమపద వైకుంఠనాథుడి రూపంలో అమ్మవారు పెద్దశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ బక్తులను సాక్షాత్కరించారు. గంటకుపైగా చిరుజల్లుల మధ్య.. ఘటాటోపం కింద పెద్దశేషవాహనసేవ సాగింది. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి వీణాపాణిగా హంసవాహనంపై జ్ఞానప్రదాయిని భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు

● బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం ముత్యపుపందిరి వాహనం
రాత్రి సింహ వాహన సేవ

నేడు 'అన్నదాత సుఖీభవ'

● 1,54,908 మంది రైతులకు జమకానున్న రూ.104 కోట్లు

తిరుపతి(కలెక్టరేట్/ఎంఆర్‌పల్లె), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండో విడత అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు బుధవారం నగదు జమ కానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. 'జిల్లాలో 1,54,908 మంది రైతులకు రూ.104కోట్లు జమ కానుంది. పీఎం కిసాన్ నగదు జమను ప్రధాని మోదీ.. అన్నదాత సుఖీభవ నగదు జమను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఈ కార్యక్రమాలను వీక్షించేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో 8వేల టన్నుల యూరియా నిల్వ ఉంది. ఎకరాకు మూడు బస్తాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది' అని అన్నారు.

అరణియార్ గేట్లు ఎత్తివేత



పిచ్చాటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని అరణియార్ పూర్తిస్థాయి నీటి మట్టం 31 అడుగులు. మంగళవారం సాయంత్రానికి 30.3 అడుగులకు నీరు చేరుకుంది. దీంతో ముందు జాగ్రత్తగా సాయంత్రం 6 గంటలకు ఒక గేటు పైకి ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నదీపరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ కోరారు.

వరదయ్యపాళెంలో 114.4 మి.మీ. వర్షం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షం పడిది. మంగళవారం ఉదయం 8.30గంటలకు నమోదైన వర్షపాతం వివరాలిలా.. వరదయ్యపాళెంలో 114.4మి.మీ, తడలో 107.2, సత్యవేడు 94.2, పిచ్చాటూరు 92.2, కేవీబీపురం 89.6, నారాయణవనం 76.4, వడమాలపేట 56.4, పుత్తూరు 50.8, బీఎన్‌కండ్రిగ 45.0, నాగలాపురం 35.4, సూళ్లూరుపేట, డీవీ సత్రం 32.8, తొట్టంబేడు 24.6మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు 33.5మి.మీగా నమోదైంది. అల్పపీడనం నేపథ్యంలో సముద్రంలో అలల ఉధ్రుతి పెరిగింది. నాలుగురోజులుగా చేపలవేట ఆగిపోయింది.

'సైనికులకు' భూకేటాయింపు తప్పేమీ కాదు

ఆ భూమిని వెనక్కి తీసుకోరాదు
తిరుపతి కలెక్టర్ నిర్ణయం సరికాదు
మూడు నెలల్లో నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్న హైకోర్టు

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైనికులకు.. మాజీ సైనికోద్యోగుల కోటా కింద భూకేటాయింపు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టతనిచ్చింది. కేవలం మాజీ సైనికులకే భూమిని కేటాయించాలనే చట్టనిబంధన ఏదీ లేదని తేల్చిచెప్పింది. సర్వీసులోని సైనికులు, మాజీ సైనికోద్యోగులు కూడా భూకేటాయింపు కోసం జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని భూపరిపాలన ప్రధాన కమిషనర్ 2022లో సర్క్యులర్ జారీ చేశారని గుర్తు చేసింది. సర్వీసులో ఉన్న సమయంలో భూకేటాయింపు చేశారనే కారణంతో భూములను వెనక్కి తీసుకోవడానికి వీల్లేదని తెలిపింది. సాయుధ దళాల్లో సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు, సరిహద్దులను, ప్రజలను కాపాడుతున్నందుకు కృతజ్ఞతగా మాజీ సైనికులకు భూకేటాయింపు విధానాన్ని తీసుకొచ్చారని పేర్కొంది. నిబంధనలు అడ్డుపెట్టుకొని మంచి ఉద్దేశాన్ని దెబ్బతీయడానికి వీల్లేదని తెలిపింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద పిటిషనర్‌కు కేటాయించిన 4.35 ఎకరాలను అడవి భూమని, అడవి పోరంబోకుగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితా(22ఏ) నుంచి తొలగించడానికి తిరుపతి కలెక్టర్ నిరాకరించడాన్ని తప్పుపట్టింది. ఈ కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి.

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాగలి పరిధిలో తిరుపతికి చెందిన చెంచయ్య నాయుడికి మాజీ సైనికోద్యోగుల కోటాలో 4.35 ఎకరాలను 2009లో అధికారులు కేటాయించారు. 2019లో ఆ భూమిని విక్రయించేందుకు ప్రయత్నించగా నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని అధికారులు చెప్పారు. ఆ జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను కోరగా.. భూమిని అడవి పోరంబోకుగా పేర్కొంటూ నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు నిరాకరించారు. అధికారుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ చెంచయ్యనాయుడు 2019లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల పై అభ్యంతరం ఉంటే భూపరిపాలన ప్రధాన కమిషనర్ వద్ద అప్పీల్ చేసుకోవాలని 2024లో వ్యాజ్యాన్ని పరిష్కరించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ చెంచయ్య నాయుడు 2015లో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. సైనికోద్యోగి తరఫున న్యాయవాది ఎంఆర్‌కె చక్రవర్తి వాదనలు వినిపిస్తూ... మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూమిని పదేళ్ల తరువాత విక్రయించుకొనేందుకు వెసులుబాటు ఉందన్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవోలు ఇచ్చిందన్నారు. ఏర్పేడు తహశీల్దార్ సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన వివరాలు ప్రకారం ఆ భూమిని తక అడవిగా వర్గీకరించారన్నారు. కలెక్టర్ మాత్రం భూమిని అడవి పోరంబోకుగా పేర్కొంటూ నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు నిరాకరించారన్నారు. సీసీఎల్ఏ సర్క్యులర్ ప్రకారం సర్వీసులో ఉన్న సైనికులు సైతం భూముల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. అడవి, అడవి పోరంబోకు పదాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కలెక్టర్ యాంత్రికంగా ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంది. తహశీల్దార్ ఇచ్చిన నివేదికలో భూమి అడవి పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ లేనప్పటికి పిటిషనర్ భూమిని అడవి పోరంబోకుగా నిర్ధారిస్తూ జిల్లా కలెక్టర్ ఎలా ఉత్తర్వులు ఇచ్చారో అర్థం కావడం లేదని పేర్కొంది. మూడునెలల్లో భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని తిరుపతి కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ లోపు తొలగించకుంటే భూముల బదిలీ/విక్రయం నిమిత్తం దస్త్రాలను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉంచవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. వాటిని పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ సుభేందు సమంతో ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

కాణిపాకంలో భక్తుల సదుపాయాలకు

రూ.25 కోట్ల టీటీడీ నిధులు

తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఆలయ ప్రాంగణంలో భక్తుల బసకు కాంప్లెక్స్.. సామూహిక వివాహాల నిర్వహణకు పెద్ద హాళ్ల నిర్మాణానికి టీటీడీ రూ.25 కోట్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు అక్టోబరు 28న టీటీడీ పాలక మండలి సమావేశంలో తీర్మానించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వ అనుమతి కోరుతూ ఈ నెల 10వ తేదీన టీటీడీ ఈవో లేఖ రాశారు. నిధులు విడుదల చేయడానికి టీటీడీ ఈవోకు అనుమతివ్వడంతో పాటు టెండర్లు పిలిచి ఆ పనులు చేపట్టాలని దేవదాయశాఖను ప్రభుత్వం ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

తలకోనకు రూ.1.90 కోట్ల అదనపు సాయం

ఎర్రావారిపాలెం మండలం తలకోన సిద్ధేశ్వరాలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం టీటీడీ రూ.1.90 కోట్ల మేరకు అదనపు సాయం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఆలయ పునరుద్ధరణకు రూ.18 కోట్లు ఇవ్వడానికి జూలైలోనే ప్రభుత్వం అనుమతిచ్చింది. మొదటి విడతగా రూ.2 కోట్లతో ఇ-టెండర్లు పిలిచారు. తాజాగా, బ్యాలెన్సు పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ.1.90 కోట్ల కేటాయింపునకు అనుమతివ్వాలని కోరుతూ టీటీడీ ఈవో ప్రభుత్వానికి ఈనెల 11న లేఖ రాశారు.

టీటీడీ డైరీ, క్యాలెండర్లు ఉచితంగా వద్దు

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఉచితంగా తీసుకోరాదని బీఆర్ నాయుడు నిర్ణయించుకున్నారు. చైర్మన్ హోదాలో ఉన్నవారికి కొన్ని డైరీలు, క్యాలెండర్లను టీటీడీ ఉచితంగా ఇవ్వడం ఆనవాయితీ. అదే పద్ధతిలో చైర్మన్‌కు పంపిన 2026 డైరీ, క్యాలెండర్లను ఆయన తిరస్కరించారు. తనకు అవసరమైతే గతేడాదిలాగే కొంటానన్నారు.

మహా నగరికి ఆమోదం



● 63 పంచాయతీలతో కలిపి గ్రేటర్ తిరుపతి
● మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సవరించిన తిరుపతి గ్రేటర్ తీర్మానానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. మంగళవారం మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం ఎస్వీయూ సెనేట్ హాలులో జరిగింది. గత నెల 24న జరిగిన కౌన్సిల్ సమావేశంలో 53 గ్రామ పంచాయతీలతో పాటు 10 రెవెన్యూ గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేసిన ప్రతిపాదన చర్చకు ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. అయితే నగరానికి అతిచేరువలో మిగిలిపోయినవి, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభీష్టం మేరకు భౌగోళిక స్వరూపం, పట్టణ లక్షణాలను పరిగణలోకి తీసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ లేఖ మేరకు రెవెన్యూ గ్రామాలను తొలగించి అదనంగా 10 గ్రామ పంచాయతీలు విలీనం చేసేందుకు ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. గత సమావేశంలో గొడవ నేపథ్యంలో ఈసారి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సమావేశంలోనూ రాద్ధాంతం చేయాలని వైసీపీ భావించింది. పది లక్షల జనాభాతో గ్రేటర్ ఏర్పాటు చేయాలంటూ ఆ పార్టీ కార్పొరేటర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. తవకుడ 12 లక్షల జనాభాతో పెట్టినా అభ్యంతరం లేదంటూ డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, సభ్యులు ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్రనాథ్ తదితరులు చెప్పడంతో వారి నోట మాట రాలేదు.

మరింత విస్తరణ అవసరం

తిరుపతి కేంద్రంగా నలువైపులా కల్యాణిడ్యాం, రాయలచెరువు, అంజారమ్మకణం, ఏర్పేడు ఐఐటీ, ఐజర్ వరకు విస్తరిస్తే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుందని మేయర్ శిరీష అభిప్రాయపడ్డారు. గ్రేటర్ పరిధిలోకి తిరుమలనూ తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి సూచించారు. 'గ్రేటర్‌పై తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండబట్టే అత్యవసర సమావేశాన్నీ ఏర్పాటు చేశామని, మేయర్ ప్రతిపాదనలనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. పాలనాసౌలభ్యం, మౌలిక వసతుల రూపకల్పన, ఆదాయం, అర్బన్ స్వరూపం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు కమిషనరు మౌర్య చెప్పారు. తొలుత 10 లక్షల జనాభాతోనే పరిశీలించినా అనుకూల అంశాలు తక్కువగా ఉన్నాయన్నారు. గ్రేటర్ క్రెడిట్ సీఎం చంద్రబాబుదేనని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ చెప్పారు.

ప్రస్తుతం	విలీనం తర్వాత
మున్సిపల్ పరిధి : 30.17 కి.మీ	వచ్చే ఆదాయం : రూ.43కోట్లు
నగర జనాభా: 4.52 లక్షలు	మొత్తం ఆదాయం: రూ.192 కోట్లు
ఆదాయం : రూ.149 కోట్లు	63 గ్రామాల జనాభా : 3.4 లక్షలు
	మొత్తం జనాభా :7.86 లక్షలు

కొత్తగా చేరిన పంచాయతీలు

తిరుపతి రూరల్ మండలంలోని బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం, గాంధీపురం, పెరుమాళ్లపల్లి, పుదిపట్ల.. చంద్రగిరి మండలంలోని రాయలపురం, బుచ్చినాయుడుపల్లె, పిచ్చినాయుడుపల్లె.. రేణిగుంట మండలంలోని అత్తూరు.. ఆర్సీపురం మండలంలోని సి.రామాపురం గ్రామ పంచాయతీలను చేర్చనున్నారు.

గ్రేటర్‌లో మేము కలవలేం

● తిరుపతి రూరల్‌లో 32 పంచాయతీల విముఖత ● సాయినగర్, న్యూమంగళం అనుకూలం

తిరుపతిరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో కలిసేందుకు రూరల్ మండలంలోని ప్రజాప్రతినిధులు విముఖత చూపారు. గ్రేటర్‌లో విలీనానికి 34 పంచాయతీల పాలకమండళ్ల అభిప్రాయ తీర్మానాలను పంపాలని కోరుతూ ఈనెల4న డీపీవో పేరిట నోటీసులు జారీ అయ్యాయి. పదిరోజుల్లోపు తీర్మానాలను సమర్పించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో 32 పంచాయతీల పాలకమండళ్లు గ్రేటర్‌లో కలవలేమంటూ తీర్మానించారు. సాయినగర్, న్యూమంగళం(శెట్టిపల్లె) పంచాయతీలు మాత్రం అనుకూలంగా తీర్మానం చేశాయి. తమకు స్థానికంగా రాజకీయ భవిష్యత్ ఉండదన్న భయంతో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు విలీనాన్ని తిరస్కరిస్తున్నారని తెలుస్తోంది. పాలక మండళ్ల తీర్మానాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్ తెలిపారు.




వాహన సేవల్లో వివిధ కళాబృందాలు తమ కళా నైపుణ్యంతో అమ్మవారికి నీరాజనం పలుకుతున్నాయి. వాహనసేవల ముందు సంప్రదాయ కోలాటాలు, చెక్కభజనలు, భజన బృందాలు, తప్పెటగుళ్లు, శాస్త్రీయ , చిన్నపిల్లల నృత్యాలు, వివిధ దేవతామూర్తుల వేషధారణతో భక్తులను ఆకట్టుకుంటూ పద్మావతీ.. పాహిమాం అంటూ ప్రణమిల్లుతున్నారు. జీయర్‌స్వాముల దివ్యప్రబంధ ప్రవచనం భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన రేకెత్తిస్తుండగా.. పండితుల వేదమంత్రోచ్ఛరణలు తిరుచానూరు పురవీధుల్లో ప్రతిధ్వనించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి





పద్మావతీ దేవికి కళారాధన






పెద్ద వాహనసేవ ముందు టీటీడీ ఈవో సింఘాల్, అధికారులు





హంసం వాహనంపై అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు



మంచు మబ్బులు.. వానచినుకులు

తిరుమలలో వణికిస్తున్న చలి

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో తిరుమలలో మంగళవారం ఉదయం నుంచీ చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. వేకువజాము నుంచే చినుకులు మొదలయ్యాయి. మరోవైపు దట్టమైన పొగమంచు తిరుమల క్షేత్రాన్ని కప్పేసింది. దీంతో చలి తీవ్రత కూడా పెరిగిపోయింది. పుష్కరిణిలో స్నానం చేసే భక్తులు తగ్గారు. చాలా మంది గదులకే పరిమితమయ్యారు. ఇక, పాపవినాశనం, శ్రీవారి పాదాలకు యాత్రికుల సందర్శన కూడా బాగా తగ్గిపోయింది. దట్టమైన పొగమంచు వల్ల మంగళవారం ఉదయం గంట పాటు ఈ మార్గాల్లో యాత్రికుల అనుమతిని రద్దు చేశారు. ఘాట్‌రోడ్లలో తరుచూ కొండ చరియలు విరిగిపడే ప్రాంతాలపై టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు.

చంద్రగిరి

ఘనంగా 72వ సహకార వారోత్సవాలు



స్వమాక్స్ సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో విశ్వనాథం

చంద్రగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక స్వర్ణముఖి మహిళా పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 72వ సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సహకార శాఖ సబ్ డివిజనల్ అధికారి రవిబాబు మాట్లాడుతూ సహకార వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్, సునీల్‌దత్ మాట్లాడుతూ సహకార సభ్యులకు ఆర్థిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్వమాక్స్ సీఈవో విశ్వనాథం ఆ సంస్థ కార్యక్రమాలను వివరిస్తూ, సభ్యుల ఆర్థిక, సామాజిక, ఇతర శిక్షణా కార్యక్రమాలు, సభ్యుల పిల్లలకు విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పదో తరగతి ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన సంఘంలోని సభ్యుల పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో స్వమాక్స్ అధ్యక్షులు పద్మావతి, సభ్యులు జానకిరామ్, రవి, వల్లిబాషా, సుబ్రమణ్యం, యుగంధర్, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను అడ్డుకోవాలి



టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

చంద్రగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. దాడులకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద నిరసన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గిరిజన, దళిత, మైనార్టీలపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. వారి ఓట్లతో అధికారాన్ని చేపట్టిన ప్రభుత్వం చులకనగా చూడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రగిరిలో గంజాయి విక్రయాలు పెరుగుతున్నా కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేపై రాజా, గీత, రవిచంద్ర, మునిరాజా, రవి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి ఎమ్మెల్యే నివాళి

భాకరాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం దిగువూరు పంచాయతీ మట్లివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్‌నేత రామకృష్ణారెడ్డి మృతి చెందిన విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం ఆయన పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామన్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, మల్లిఖార్జునరెడ్డి, రమేశ్, రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు గిరిజన విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ నుంచి సైకిళ్లను అందుకున్న ఎస్టీ కాలనీ విద్యార్థినులు

తిరుపతి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవాసంస్థ రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థినులకు సైకిళ్లను ఉచితంగా అందజేశారు. గ్లోబల్ ఫౌండేషన్ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా తిరుపతి రూరల్ మండలం భాగ్యనగరం ఎస్టీ కాలనీకి చెందిన విద్యార్థినులకు మంగళవారం సైకిళ్లను అందజేసింది. ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల సౌజన్యంతో యానాది కాలనీ పాఠశాల ఉపాధ్యాయురాలు మానస సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.

వేడుకగా కార్తీకమాస దీపోత్సవం





నాగకాళిదేవి అమ్మవారు, దీపాలు వెలిగిస్తున్న సుధారెడ్డి తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం లింగేశ్వరనగర్‌లో వెలసిన నాగకాళిదేవి ఆలయంలో మంగళవారం కార్తీకమాస దీపోత్సవ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు, మహిళలు ఆమెకి ఘన స్వాగతం పలికారు. భక్తులతో కలసి కార్తీక దీపాన్ని వెలిగించి మొక్కు చెల్లించారు. అన్న, ప్రసాదవితరణ సేవ నిర్వహించారు. కూటమిపార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్ట్రీట్ ఫుడ్‌కు అలవాటు పడకండి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ నాగమణి

చంద్రగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులూ.. స్ట్రీట్ ఫుడ్‌కు అలవాటు పడకండి అంటూ చంద్రగిరి ఏఎస్ఐ నాగమణి సూచించారు. మంగళవారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు బందోబస్తులో ఉన్న ఏఎస్ఐ విద్యార్థినులతో మాట్లాడుతూ స్ట్రీట్ ఫుడ్ వలన అనారోగ్య సమస్యలకు గురవుతారని తెలిపారు. పాఠశాల ముందు అబ్బాయిలతో మాట్లాడకూడదని, అబ్బాయిలు ఎవరైనా కావాలని మాట్లాడిస్తే వెంటనే డయల్ 100కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఆకతాయిలు పాఠశాల ముందు సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం

ఎర్రావారిపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి); మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ కేంద్రాన్ని ఎంఈవో సతీష్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ఈ నెల 28వ తేదీ వరకు పని చేస్తుంది. ఆధార్‌లేని విదార్థులు, పేరు, పుట్టినతేది, తల్లిదండ్రుల పేర్ల సవరణలు చేపడుతున్నారు. మండలంలోని విద్యార్థులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

భాకరాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డలో వైసీపీ మండల అధ్యక్షుడు సింహాల మోహన్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిర్మల, సర్పంచ్ కిశోర్ కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటాచలపతి, మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో స్టాఫ్ నర్సుల నియామకానికి నిర్ణయం

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సమీక్ష జరిగింది. 236 స్టాఫ్ నర్సులు, 20 పారా మెడికల్ సిబ్బంది, 48 అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల భర్తీకి గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. డైరెక్ట్ రిక్రూట్మెంట్ పద్ధతిలో ఈ పోస్టులను భర్తీ చేసేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.84 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,208

తలనీలాలు సమర్పించినవారు: 23,135

ఘాట్‌రోడ్డులోని లక్ష్మీనరసింహస్వామికి నేడు ప్రత్యేకాభిషేకం

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో నడకమార్గంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామికి బుధవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు. కార్తీకమాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం టీటీడీ నిర్వహిస్తోంది.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో తండ్రీ కొడుకులకు మూడేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తండ్రి, కుమారుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ తెలిపిన ప్రకారం... అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం గొల్లవానిగుంటకు చెందిన తండ్రీ కొడుకులు ఎన్.చంద్రశేఖర్ నాయుడు, రెడ్డిశేఖర్ కలిసి పాపేపల్లి క్రాస్ వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 2015లో పట్టుబడ్డారు. అప్పటి పెద్దమండ్యం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేసి దుంగలు సీజ్ చేశారు. ఆ తర్వాత వీరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసును రాయచోటి నుంచి తిరుపతిలోని రాష్ట్ర స్థాయి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో ఏకీభవించి నిందితులైన తండ్రీ కొడుకులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే పులివర్తి నాని



భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో ఎర్రావారిపాలెం మండలంలోని రెవెన్యూ సమస్యలపై ఏర్పాటుచేసిన పరిష్కార వేదిక సదస్సులో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు, రైతుల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా భూముల ఆన్‌లైన్, పాసుపుస్తకాలు, పొలాలకు దారి సమస్యలు, ప్రభుత్వ, బంజరు, పోరంబోకు, వాగు వంకల భూములను ఆక్రమించి దారులు మూసివేత తదితర సమస్యలపై బాధితులు ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఫిర్యాదును ఎమ్మెల్యే స్వయంగా తీసుకొని, దానిపై సంతకం వేసి రెవెన్యూ రికార్డులో అధికారులతో నమోదు చేయించారు. మండలంలోని 10 గ్రామాల నుంచి 216 సమస్యలపై రైతులు ఫిర్యాదులు అందించారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రైతులకు భూసమస్యలు లేకుండా ఉన్నప్పుడే గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయన్నారు. ఈ సమస్యలపై నిర్దీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సదస్సులో ఆర్డీవో రాంమోహన్, తహశీల్దార్ పరమేశ్వర స్వామి, డీటీ పరదేశి, ఎంపీడీవో దివాకర్, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు స్థిరాస్తి హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



గ్రామసభలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

రామచంద్రాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వామిత్వతోనే గ్రామాల్లో అనాధీనం, గ్రామ కంఠాలు, ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటున్న గ్రామీణులకు స్థిరాస్తి హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ రైతు విభాగం అధ్యక్షుడు పూజారి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మండలంలోని సొరకాయలపాళెం గ్రామ సచివాలయం వద్ద స్వామిత్వపై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నివాసస్థలాల్లో పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి లబ్ధిదారులకు ఆస్తిహక్కు కల్పించి, ఆస్తి యాజమాన్యం ధ్రువపత్రాలను అందిస్తారన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో మాట్లాడుతూ స్వామిత్వ ద్వారా పొందే స్థిరాస్తి కార్డుల ద్వారా ఇంటి రుణాలను, క్రయవిక్రయాలను చేసుకోవడానికి వీలుంటుందన్నారు. టీడీపీ సీనియర్ నేత కాయం చంద్రబాబుయాదవ్ మాట్లాడుతూ స్వామిత్వ సర్వేను అధికారులు లబ్ధిదారుల సమక్షంలో నిష్పక్షపాతంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. 250మంది లబ్ధిదారులను స్థిరాస్తి కార్డులకు ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ తెలిపారు. ఉమ్మడి కుటుంబానికి చెందిన లబ్ధిదారులు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. వాటిని విచారణ చేసిన అనంతరం కార్డును పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమ్య, గౌతమ్, పురుషోత్తం, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అమ్మవారికి ఉద్యోగినుల సారె

తిరుచానూరు. నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో పద్మావతి అమ్మవారికి టీటీడీ ఉద్యోగినులు కొన్నేళ్లుగా సారె సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆస్థాన మండపం నుంచి టీటీడీ పద్మావతి మహిళా అసోసియేషన్ వారు పట్టువస్త్రాలు, సారె తీసుకెళ్లి ఆలయాధికారులకు సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు హేమలత, లక్ష్మీదేవి, అనురాధ, జ్యోతి, గంగ, జమున, రజని, లలిత, భవ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'భూసేకరణ' పూర్తిచేయండి




అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైల్వేప్రాజెక్టులు, క్రిస్‌సిటీ, ఏపీఐఐసీ తదితర వాటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రైల్వేప్రాజెక్టులు, పరిశ్రమలకు సంబంధించి భూసంబంధిత పెండింగ్ పురోగతి అంశాలు, నిర్మాణ పురోగతిపై ఆయన అధికారులతో సమీక్షించారు. రేణిగుంట నుంచి పూడి, శ్రీకాళహస్తి, గూడూరు, బాలాయపల్లి, వెంకటగిరి, తిరుపతి, పాకాల, అరక్కోణం, రేణిగుంట, గుమ్మడిపూడికి సంబంధించిన రైల్వేప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. క్రిస్‌సిటీ, శ్రీసిటీ పెండింగ్ భూసమస్యలు పరిష్కరించాలన్నారు. నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, రామ్మోహన్, ఏపీఐఐసీ జెడ్ఎం విజయభరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్),నవంబరు18(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లి వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశం కోసం ఉమ్మడి జిల్లాలో డిసెంబరు 13న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గీత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌డెస్క్ 89199 56395 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చని ఆమె కోరారు.

లైబ్రరీ సైన్స్ సదస్సులో పరిశోధనా పత్రాల సమర్పణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో రెండో రోజైన మంగళవారం లైబ్రరీ సైన్స్ అంతర్జాతీయ సదస్సు కొనసాగింది. సమాంతర సదస్సుల్లో ప్రతినిధులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతినిధులను అలరించాయి. వీణ నిర్వహించిన వీణా వాయిద్య ప్రదర్శన.. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ చల్లా ప్రభావతి శిష్య బృందం 'శ్రీనివాస కల్యాణం' నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కళాకారులను అంతర్జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు సత్కరించారు. పద్మావతి, వేంకటేశ్వరస్వామి పాత్రలు వేదికపైకి రాగానే దేశ, విదేశీ ప్రతినిధులు నిలబడి నమస్కరించుకున్నారు. కాగా, ఈ సదస్సు బుధవారం ముగియనుంది. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) సలహాదారు డాక్టర్ జగదీష్ అరోరా పాల్గొంటారు.



ధ్వంసమైన టమోటా పంట

పంట పొలాలపై గజదాడులు

భాకరాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ వడ్డిపల్లె గ్రామానికి చెందిన సురేంద్ర, చుక్కలింగం, శేషాద్రికి చెందిన వరి పైరు, సుధాకర్‌కు చెందిన టమోటా పంట, మల్లయ్యకు చెందిన మామిడి చెట్లను సోమవారం రాత్రి ఏనుగులు విరిచేశాయి. అనంతరం సమీపంలోని జంగమాలకొండ ప్రాంతానికి వెళ్లాయి. మంగళవారం రాత్రి గొల్లపల్లె, చిట్టేచర్ల, సిరిగలవారిపల్లె గ్రామాల వద్దకు వచ్చే అవకాశం ఉందని, రైతులు పొలాలవైపు వెళ్లవద్దని అటవీ శాఖాధికారులు అప్రమత్తం చేశారు. ఏనుగులు గ్రామాలవైపు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాష్ట్రపతి రాక సందర్భంగా తిరుచానూరులో రేపు ట్రాఫిక్ ఆంక్షలు

తిరుచానూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పూడి, అప్పలాయగుంట నుంచి వచ్చే వాహనాలు ముండ్లపూడి మీదుగా మళ్లించాం.తిరుచానూరు బైపాస్ రోడ్డు నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే రంగనాథం వీధిలో వాహనాల రాకపోకలు నిషేధం. గేట్ నెంబరు2,3, హైస్కూల్ ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేయరాదు. తిరుపతి నుంచి రేణిగుంట నుంచి వైపు నుంచి వచ్చే వాహనాలను నారాయణాద్రి వరకే అనుమతిస్తాం. ఇక శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనాలను గాజులమండ్యం సర్కిల్ నుంచిరేణిగుంట మీదుగా తిరుపతిలోకి మళ్లిస్తున్నాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రకృతి సేద్యంతో పర్యావరణ పరిరక్షణ



సభలో మాట్లాడుతున్న నీరజ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పద్మావతి వర్సిటీ ఉమెన్ స్టడీస్ అధ్యాపకురాలు నీరజ పేర్కొన్నారు. ఆర్సీపురం మండలం కుప్పంబాదూరులో ప్రకృతి వ్యవసాయంపై చేపట్టిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఇటు మనిషికీ, అటు పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. మహిళలు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తే అందరికీ అవగాహన ఏర్పడుతుందన్నారు. దీంతో మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. విమల, రాగమ్మ, మేఘన, జయశ్రీ, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న విషయ నిపుణులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీలో మంగళవారం చేపట్టిన అవగాహన కార్యక్రమంలో మెడికల్ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, జనరల్ సర్జరీ విభాగాధిపతి రోజా రమణి, రుయా రిటైర్డు సూపరింటెంట్ భారతి, రోటరీ క్లబ్ ప్రతినిధి నాగేంద్ర, ప్రముఖ సామాజిక సేవకులు టెంకాయల దామోదరం పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలిక రోగులు కొన్ని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ అధికారి లలితకుమారి, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ మాధవి, పద్మావతి, అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్య - పరిష్కారంపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో సమస్య - పరిష్కారం అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ చేపట్టారు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుందనే ఆలోచనను ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని విషయ నిపుణులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒక సమస్యకు సంబంధించి లోతుగా అధ్యయనం చేయడం ద్వారా పరిష్కారాన్ని గుర్తించవచ్చన్నారు. తద్వారా సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన కొత్త పద్ధతులను అన్వేషించాలని కోరారు. సృజనాత్మకతను పెంపొందించుకోవడం ద్వారా నిజ జీవిత సమస్యలకు కూడా పరిష్కారాలను కనుక్కోవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీ-అడిక్షన్ సెంటర్ సేవలపై కమిషనర్ అసంతృప్తి



డీఅడిక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డీ-అడిక్షన్ సెంటర్ (మత్తు వ్యసనపరుల చికిత్స కేంద్రం) సేవలపై ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అసంతృప్తి వ్యక్తంచేశారు. మంగళవారం కెనడీ నగర్‌లో కార్పొరేషన్ నిర్వహిస్తున్న డీ-అడిక్షన్ సెంటర్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. సేవలకోసం వస్తున్నవారి వివరాలు సక్రమంగా లేకపోవడంపై మండిపడ్డారు. సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సెంటర్‌కు వచ్చే వారికి నాణ్యమైన చికిత్స అందించాలని, మరోసారి మత్తు పదార్థాలు వినియోగించకుండా పరివర్తన తీసుకురావాలని తెలిపారు. వారివారి విధులను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. అనంతరం పక్కనే ఉన్న 12, 13 వార్డు సచివాలయాలకు వెళ్లి, సిబ్బంది హాజరు నమోదును పరిశీలించారు. అన్ని విభాగాల కార్యదర్శులు ఖచ్చితంగా హాజరు నమోదు చేయాలని తెలిపారు. ఏదైనా ఫీల్డ్‌కి వెళ్లినా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట డీసీ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ డీఈ కార్యాలయంలోకి వెళ్లాలంటే
మురుగు గుంటలు దాటాల్సిందే...!



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ డీఈ కార్యాలయం ముందు ఉన్న మురుగు నీటి గుంటలను దాటుకొని కార్యాలయంలోనికి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోందని వినియోగదారులు, ఉద్యోగులు వాపోతున్నారు. గతంలో ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని తెలిపారు. పాత తిరుచానూరు రోడ్డులో తిరుపతి విద్యుత్‌టౌన్, రూరల్ డీఈ కార్యాలయాలతో పాటు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ టౌన్, రూరల్ కార్యాలయాలతో పాటు వినియోగదారులకు సేవలందించడానికి కాల్ సెంటర్ ఉంది. వర్షం వస్తే పై కార్యాలయాల్లోకి వెళ్లాలంటే కాల్ సెంటర్ ఎదుట వున్న మురుగు నీటి మడుగులు దాటుకొని వెళ్లాల్సి వస్తోందని వినియోగదారులు, ఉద్యోగులు వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా వర్షం వస్తే ఈ తిప్పలు తప్పడం లేదన్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన నూతన డీఈ భవనం ఎదుట పార్కులా ఉండాల్సిన స్థలం మురుగు గుంటగా మారుతోంది. నీరు నిల్వవుండటంతో దోమలకు నిలయంగా మారుతోంది. విద్యుత్ సమస్యల పరిష్కారానికొచ్చి దోమల కాటుకు గురవుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. దీనిపై విద్యుత్ సివిల్ విభాగం అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడంలేదని ఉద్యోగులు చర్చించుకోవడం కొసమెరుపు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వరప్రసాద్‌ను అభినందించిన ఎమ్మెల్యే

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వరప్రసాద్ మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌ను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. అనంతరం నగరాభివృద్ధిపై చర్చించారు.

రాజా రామ్మోహన్‌రాయ్‌ను అవమానించడం హేయం

తిరుపతి(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భారతీయ పునరుజ్జీవన మార్గదర్శకులు, సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్‌పై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) నాయకులు ప్రొఫెసర్ తరుణ్ క్రాంతిసార్కర్ పేర్కొన్నారు. రాజా రామ్మోహన్‌రాయ్‌ను మత మార్పిడులకు సహాయం చేసిన బ్రిటిష్ ఏజెంట్‌గా మధ్యప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ మంత్రి, బీజేపీ నాయకుడు ఇందర్‌సింగ్ పర్మార్ అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండించారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, ఫాసిస్ట్ భావాలు కలిగిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను దేశంలోని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అలాగే ఇందర్‌సింగ్ పర్మార్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో 23 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. వీరిలో 23 మందిని మంగళవారం తిరుపతి మూడవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి సంధ్యారాణి ఎదుట హాజరుపరిచారు. వీరిని విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున మొత్తం రూ.2.30 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న 14 మందికి ఒక్కొక్కరికి రూ.500 వంతున మొత్తం రూ.7000 జరిమానా విధించారు.

అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రాస్ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగలరని రాస్ జాయింట్ సెక్రటరీ మమత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేశాలమ్మగుడివీధి, పూసలవీధి పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, మంగళం-1, మంగళం గ్రామం, మిట్టగాంధిపురం, అక్కారంపల్లి, హౌసింగ్‌బోర్డు, ఇందిరానగర్, ప్రగతినగర్, బండ్లవీధి, ఉప్పరపాళెం పరిధిలో ఒక్కో సహాయకురాలి పోస్టుతోపాటు వినాయకనగర్‌లో 2, కొర్లగుంటలో 5 సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు, స్థానికంగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 19 నుంచి 25వ తేదీలోపు పూర్తి చేసిన దరకాస్తులను ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని రాస్ ప్రధానకార్యాలయంలో అందజేయాలన్నారు.

విద్యుత్ సీఎండీకి పలువురి శుభాకాంక్షలు



కేక్‌కట్ చేస్తున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సదరన్ డిస్కం చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ తన పుట్టిన రోజును ఉద్యోగుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కేక్‌కట్ చేసి అధికారులకు, ఉద్యోగులకు పంచిపెట్టారు. సీఎండీకి డైరెక్టర్లు, అధికారులు. ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ముక్కంటి సేవలో రష్యా భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూ నాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళ వారం సుమారు 40మంది రష్యా భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండి తులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రష్యన్ భక్తులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శిల్పకళ అబ్బురపరుస్తోందన్నారు.



కందాల గోవిందాచార్యుల ట్రస్టు ఆస్తి స్వాధీనం

● దుకాణాలు, ఇళ్లను సీజ్‌చేసిన అధికారులు

తిరుపతి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తీర్థకట్టవీధి 10వ డివిజన్‌లో డోర్ నెంబర్ 10-2-157, 158లో గల 4,576 చదరపు అడుగుల స్థలం, 2,484చదరపు అడుగుల ఆస్తిని కందాల గోవిందాచార్యుల ట్రస్టు నిర్వాహకులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 1993లో ట్రస్టు కె.పద్మావతి అనే పేరుపై ఈ స్థలాలను ట్రస్టు లీజుకు అప్పగించింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత మూడంతస్తుల భవనాన్ని నిర్మించారు. కిందిభాగంలో పది దుకాణాలు ఏర్పాటుచేశారు. ట్రస్టుకు నామమాత్రపు అద్దెలు చెల్లించేవారు. అప్పట్లో పట్టించుకోకపోయినా 2015లో ఉన్న అధికారులు స్థలాన్ని పరిశీలించే సమయంలో దుకాణాలు, భవనం సబ్‌లీజుకు ఇచ్చి అద్దెలు రూ.లక్షల్లో వసూలు చేస్తున్న సంగతిని కనుగొన్నారు. దీంతో శాశ్వత భవనం ఎలా నిర్మిస్తారని తొలగించి స్థలాన్ని అప్పగించాలని ఆదేశించారు. లీజుదారులు లెక్కచేయకపోవడంతో ట్రస్టు హైకోర్టును ఆశ్రయించింది. చివరికి గత జూలై 17న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆ తరువాత లీజుదారులను హెచ్చరించి బోర్డు ఏర్పాటు చేసినా పట్టించుకోలేదు. ఈనెల 14న మరోసారి ఉత్తర్వులు వెలువరించడంతో మంగళవారం రెవెన్యూ అధికారులు, విద్యుత్, పోలీసు అధికారుల సహకారంతో కందాల గోవిందాచార్యుల ట్రస్టు ఈవో పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థలం, భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడి సహకారంతో విలువైన స్థలాన్ని, భవనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.





సీజ్ చేసి స్వాధీనం చేసుకున్న భవనం- దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

పరకామణి కేసు నిందితులకు శిక్ష తప్పదు

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ పరకామణి కేసుకు సంబంధించిన నిందితులకు శిక్ష తప్పదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి శిక్ష నుంచి కూడా తప్పించుకోలేరని స్పష్టం చేశారు. మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతిపై టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు ఆత్మహత్య అని ప్రకటించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి కార్యకలాపాలన్నీ కరుణాకరరెడ్డికి తెలిసే జరిగాయన్నారు. సతీష్‌కుమార్ మృతితో కరుణాకరరెడ్డికి సంబంధముండే అవకాశముందన్నారు. పరకామణి చోరీ కేసులో సీఐడీ విచారణకు వస్తూ సతీష్‌కుమార్ చనిపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకొని విచారణను సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్‌కు అప్పగించిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమలలో ప్రక్షాళన జరిగిందన్నారు. సమావేశంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, హరిశంకర్, లోకేశ్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ప్రశాంతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ కంప్యూటర్ సైన్స్ పరిశోధకులు కె.ప్రశాంతి డాక్టరేట్ పొందారు. యాన్ ఆన్ అడాప్టివ్ బిగ్‌డేటా డ్రైవెన్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ సైబర్ అటాక్ డిటెక్షన్ విత్ యూజర్ బిహేవియర్ అనలిటిక్స్ యూజింగ్ ఫెడరేటెడ్ లెర్నింగ్ మోడల్స్ అంశంపై ప్రొఫెసర్ సంధ్యారాణి, ప్రొఫెసర్ వెంకట కృష్ణ సంయుక్త పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ప్రశాంతి వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకురాలిగా ఉన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నాగవంశీ

తిరుమల, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, సినీ నిర్మాత నాగవంశీ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

అంతర్ కళాశాల గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో ఓవరాల్ చాంపియన్‌గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో గతవారంలో జరిగిన అంతర్ కళాశాల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల(అటానమస్)జట్టు మూడు విభాగాల్లో విజయం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. గేమ్స్ విభాగంలో అగ్రస్థానం దక్కించుకొని రూ.30వేలు, అథ్లెటిక్స్ విభాగంలో జాయింట్ చాంపియన్‌షిప్ సాధించి రూ.15వేలు, వ్యక్తిగత ప్రతిభ ప్రదర్శించిన సుదర్శన్ చాంపియన్‌గా నిలిచి రూ.1,500 నగదు బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. మెడల్స్, ట్రోఫీ, షీల్డ్‌లను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం కళాశాలకు గర్వకారణమన్నారు. దీనికి ప్రత్యేక కృషిచేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.ముస్తాక్ అహ్మద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లికార్జునరావు, అధ్యాపకులు ఎం.కిరణ్‌కుమార్ రాజు, భీమన్న పాల్గొన్నారు.

వ్యవసాయరంగానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

● వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ



మీడియాతో మాట్లాడుతున్న బి.నారాయణ

మంగళం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం మెట్ట ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టులైన హంద్రీనీవా, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీలను పూర్తిచేస్తే 20.76 లక్షల ఎకరాలకు సాగునీరు, 2కోట్ల మంది ప్రజలకు తాగునీరు ఇవ్వవచ్చని, ఇందుకుగాను రాబోయే బడ్జెట్‌లో సంవత్సరానికి రూ.10వేల కోట్లు కేటాయించాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం కడపలో స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి చేసి 30వేలమందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అన్నిపార్టీలు అధికారంలో ఉన్న సమయంలో కేంద్రంతో కుమ్మక్కై ప్రజలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. డిసెంబరులో పెద్దఎత్తునప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు మేధావులు, ప్రజలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి, యువజన నాయకులను కలుపుకుని ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంప్రసాద్, రవిశంకర్ రెడ్డి, సత్తార్, గుర్రప్ప, వైవీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ కోసం ప్రజాప్రతినిధులను కలిసిన సాధన సమితి నాయకులు



ఎంపీ వేమిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైల్వే డివిజన్ సాధన సమితి నాయకులు

తిరుపతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు కోసం మంగళవారం సాధన సమితి నాయకులు వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. తిరుమలకు వచ్చిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి టీటీడీ సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసిని రైల్వే డివిజన్ ఆవశ్యకత గురించి వివరించారు. సానుకూలంగా స్పందించిన వారు తమవంతు ప్రయత్నం చేస్తానని చెప్పినట్టు తెలిసింది. అదేవిధంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి రైల్వే డివిజన్ సాధిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. పార్టీలకు అతీతంగా అందరూ కలసి తిరుపతికి రైల్వే డివిజన్ సాధన కోసం తమవంతు సహకారం ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బాలాజీ డివిజన్ సాధనసమితి కన్వీనర్ కొప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, వైఎస్ బాబు, సూరినేని బుజ్జిబాబు నాయుడు, నీలేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ముగిసిన రుద్రహోమం

● వైభవంగా శివపార్వతుల కళ్యాణం

● నేడు ధర్మ శాస్త్ర హోమం, రేపు త్రిశూల స్నానం



రుద్రయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం మంగళవారం శాస్త్రోక్తంగా ముగిసింది. నెల రోజుల పాటు జరుగుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకూ 11 రోజుల పాటు ఈ హోమం నిర్వహించారు. హోమ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. బుధవారం ధర్మ శాస్త్ర హోమం, గురువారం చండికేశ్వర స్వామి హోమం, త్రిశూల స్నానం, పంచ మూర్తుల తిరువీధి ఉత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

కడలి కల్లోలం



శ్రీనివాససత్రం వద్ద సముద్రంలో అలల ఉధృతి

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం విడవని ముసురు, చలిగాలులతో పాటు మోస్తారు వర్షం కురిసింది. కోట మండలం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం సముద్రంలో అలల ఉధృతి పెరిగింది. నాలుగు రోజులుగా సముద్రంలో చేపలవేట ఆగిపోయిందని, బోట్లు, వలలు, సముద్రపు ఒడ్డుకు చేర్చామని మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రంతీరంలో అలలు భారీగా ఎగిసిపడుతుండడంతో గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, వావిళ్లదొరువు, కొత్తపట్నం, యమదిన్నెపాళెం, గున్నంపడియ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పుత్తూరు వార్తలు

'గూళూరు'ను వివాదరహితంగా పరిష్కరిస్తాం

కలెక్టర్ వెంకటేశ్వర్



గూళూరు చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

వడమాలపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళూరు చెరువు సమస్య రెండు మండలాలకు సంబంధించిందని, వివాదరహితంగా పరిష్కరించాల్సి ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. మంగళవారం గూళూరు చెరువు, కలుజులను ఆయన పరిశీలించారు.చెరువు వడమాలపేట మండల పరిధిలో ఉండగా, ఆయకట్టు పుత్తూరు మండల పరిధిలో ఉంది. ఈ సందర్భంగా కలుజు వద్ద పుత్తూరు ఆయకట్టుదారులు మాట్లాడుతూ... చెరువులో నీళ్లుంటే పంటలు పండుతాయని, తాగునీటి అవసరాలు తీరుతాయని కలెక్టర్‌కు వివరించారు. వడమాలపేట మండల పరిధిలోని చెరువు నిర్వాసితులు మాట్లాడుతూ... 2019 నుంచి చెరువు నిండి ఉండడంతో పట్టా భూములున్నా సాగులేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. అలాగే ఆధి ఆంధ్రవాడ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తూములకు మరమ్మతులు చేసి నీళ్ల కిందికి వదలాలని కలెక్టర్‌కు విన్నవించారు. చెరువు, ఆయకట్టు స్థితిగతులను రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల ద్వారా రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించారు. రెండు మండలాల వారి వాదనలు విన్న అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... సమస్యను త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, డీఈ శ్రీనివాస్, ఏఈలు నాయర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

రింగు రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘ నాయకులు

పుత్తూరు టౌన్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తడుకు నుంచి సిరుగురాజుపాళెం వరకు రింగురోడ్డుకు మర మ్మతులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం గూళూరు చెరువు పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌కు దళిత సంఘ నాయకుడు నందయ్య ఆధ్వ ర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ ఈ రింగు రోడ్డు మీదుగా సుమారు 5 గ్రా మాలకు దారి వసతి ఉందన్నారు. 10 ఏళ్లుగా రోడ్డు ధ్వంసమై రాకపోకలకు ఇబ్బంది పడుతున్నట్టు పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి



రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పనివేళల్లో సచివాలయ సిబ్బంది విధిగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ నాగే శ్వరరావు చెప్పారు. మున్సిపల్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావు మంగళవారం ఆర్టీసీ కాలనీ, కళ్యాణపురం, ఆరేటమ్మ కాలనీ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సిబ్బంది అందుబాటులో లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

పుత్తూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వ్యాస, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ పోటీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారి మీనాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టండి: సీపీఐ

పుత్తూరు టౌన్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకి రాజకీయ సామాజిక న్యాయం పొందడానికి కులగణన చేపట్టాలని సీపీఐ పుత్తూరు డివిజన్ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద దళిత సంఘ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న నేటికి దళితులు అభివృద్ధి చెందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

బాలల హక్కుల వారోత్సవాలు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాల్యం అమూల్యమైందని చిన్నతనం నుంచే ఉన్నతమైన ఆలోచనలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష చెప్పారు. మండలంలోని మునగలపాళెం ప్రభుత్వ పాఠశాల, బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం బాలల హక్కుల వారోత్సవాలను ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలల రక్షణ, భాగస్వామ్యం, హక్కులపై అవగాహన పెంపొందించారు. ఈ నెల 14 నుంచి స్నేహపూర్వక సమావేశాలు, పోస్టర్ల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, బాల్యవివాహం, బాల కార్మికులు, అక్రమ రవాణా, విద్యాహక్కు, భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ మురగయ్య, వెంకటేష్, అంగన్‌వాడీ వర్కర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

నాయుడుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.... 2021లో నాయుడుపేట మండలం వేముగుంటపాళెం గ్రామానికి చెందిన మల్లికార్జున్ ఓ బాలికకు మాయమాటలు చెప్పి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నాయుడుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ కుమారి తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, మైక్రో బయాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ, బీకాం కోర్సులు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఇంటర్ మార్క్స్ లిస్టు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్, టీసీ తీసుకువచ్చి అడ్మిషన్ పొందవచ్చన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య సిబ్బందితో కలిసి దాడులు చేశారు. 45 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారులకు జరిమానా విధించారు.





రైల్వేస్టేషన్, క్వార్టర్స్ సమీపంలో దెబ్బతిని గోతులమంగా ఉన్న రోడ్డు

మడుగుల్లా రోడ్లు..!

రాకపోకలకు అవస్థలు పడుతున్న స్థానికులు

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పెద్దపెద్ద గోతులు ఏర్పడి వర్షపునీటితో మడుగులను తలపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లలో నీరు నిల్వచేరి గోతుల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. రెండో పట్టణం నుంచి ఒకటో పట్టణానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో స్వర్ణభారతి నగర్ సమీపంలోని రైల్వేగేటు వద్ద వర్షం పడిదంటే మోకాలు లోతు నీరు నిల్వ చేరిపోతుంది. ఈ మార్గం ద్వారా ఒకటో - రెండో పట్టణాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఎస్‌కేఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల, ఐటీ, సిరామిక్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు వెళ్లడానికి ఒకటో పట్టణానికి చెందిన విద్యార్థులు, ప్రజలు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే



రైల్వేగేటు సమీపంలో నిల్వ చేరిన వర్షపునీరు

నీరు చేరి మడుగుగా మారడంతో వాహనదారులు, పాదచారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అదేవిధంగా రైల్వేస్టేషన్, రైల్వేక్వార్టర్స్ సమీపంలో రోడ్డు దెబ్బతిని గోతులు ఏర్పడ్డాయి. వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాస్త గూడు కల్పించండి సారూ..!

పక్కా గృహాలు లేక గిరిజనుల అవస్థలు ● వర్షాలు వస్తే పునరావాస కేంద్రమే దిక్కు

కోట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న యానాదుల కాలనీలోని గిరిజనులు గూడులేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ గత రెండు దశాబ్దాలుగా 40 కుటుంబాలకు పైగా యానాదులు నివాసం ఉంటున్నారు. వీరంతా పక్కనే ఉన్న స్వర్ణముఖి నదితో పాటు ఉప్పుటేరులో చేపలు వేటాడి



గిరిజనులు నివాసం ఉంటున్న పూరి గుడిసెలు

పట్టుకొచ్చి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని వీరికి సరైన గూడులేదు. అందరూ తాటాకులతో పూరిపాకలు వేసుకొని నివాసం ఉంటున్నారు. భారీ వర్షం, తుఫాన్ వస్తే గిరిజనులు నివాసం ఉంటున్న పాకలన్నీ గాలికి కొట్టుకుపోతాయి. పిల్లా పెద్దలతో పాటు రెండు కిలోమీటర్ల దూరంలోని తిన్నెలపూడికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో తలదాచుకుంటారు. ఏటా వర్షా కాలంలో గిరిజనులకు ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు స్పందించి తమకు పక్కా గృహాలు మంజూరు చేయాలని యానాదులు కోరుతున్నారు.

మస్టర్లు సిద్ధం చేసేద్దాం!



ఎంపీడీవో కార్యాలయంలో మస్టర్లు సిద్ధం చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆఘమేఘాలపై మస్టర్లను రెడీ చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధి పనులు, నగదు లావాదేవీలు, కూలీల వేతనాలకు సంబంధించి గురువారం అన్ని పంచాయతీల్లో బహిరంగ సామాజిక తనిఖీలు జరగనున్నాయి. డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు గ్రామాల్లో ఇంటింటా తిరిగి ఉపాధి పనుల సంబంధించి విచారణ చేయనున్నారు. ఈనేపథ్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో కార్యాలయంలోని గదిలో తలుపులు వేసుకొని ఉపాధి పనులకు సంబంధించిన మస్టర్లు చకచకా సిద్ధం చేశారు.

కుష్ఠువ్యాధి సర్వే సమగ్రంగా చేపట్టాలి

ఓజిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఓజిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ డానియేల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో సుబ్బరామయ్య పర్యవేక్షణలో కుష్ఠువ్యాధి సర్వేను జరుగుతుందన్నారు. తెల్ల మచ్చలు, స్పర్శలేని పొడలు వంటివాటిని గుర్తించి పరిశీలనకు తీసుకోవాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సూళ్లూరురుపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ క్విజ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తడ: మండల పరిధిలోని వేనాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తక పఠనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేస్తామని గ్రంథాలయ కార్యదర్శి కల్యాణి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో పర్యావరణ పరిరక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పద్మావతి వర్సిటీ ఉమెన్ స్టడీస్ అధ్యాపకురాలు నీరజ పేర్కొన్నారు. ఆర్సీపురం మండలం కుప్పంబాదూరులో ప్రకృతి వ్యవసాయంపై చేపట్టిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఇటు మనిషికీ, అటు పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. మహిళలు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తే అందరికీ అవగాహన ఏర్పడుతుందన్నారు. దీంతో మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. విమల, రాగమ్మ, మేఘన, జయశ్రీ, మహిళా రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రణాళికలు

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళా సాధికారత సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర అధ్యక్షురాలు కొండేటి ముత్యాలమ్మ ఆధ్వర్యంలో సంఘబంధం అధ్యక్షురాళ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోట మండలం మోడల్‌గా ఏర్పడిన నేపథ్యంలో పొదుపు సంఘాల మహిళలు అభివృద్ధి సాధించేలా సంఘ బంధం అధ్యక్షులు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మహిళల విద్య, ఆరోగ్యం, వైద్యం, సామాజిక భద్రత, ఆర్థిక సుస్థిరత, స్థిరమైన ఆస్తి కలిగి ఉండటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీసీలు ప్రసాద్, శంకర్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

బాలాయపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని వెలుగు ఏపీఎం కిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర సభ్యులు, వీవోఏలకు శిక్షణ కర్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, జీవనోపాధిపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో వార్షిక ప్రణాళిక రూపొందించి, తద్వారా గ్రామ, మండల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి చెంగల్‌రాయులు, ఎల్‌సీ సీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నేరవేర్చడమే ధ్యేయం



లబ్ధిదారులకు ఇంటి ధృవపత్రాలు అందజేస్తున్న డీఎల్‌పీవో వాణి

వాకాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు దువ్వూరు మధుసూదనరెడ్డి అన్నారు. మండలంలోని కొండూరుపాళెంలో స్వామిత్వ గ్రామసభ మంగళవారం ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. 181 మంది పేదలకు మంజూరైన ఇళ్ల ధృవపత్రాలను డీఎల్‌పీవో వాణి, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, పంచాయతీ కార్యదర్శి శివకుమారి పాల్గొన్నారు.

నేడు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ

ఓజిలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు, సంఘ బంధాల సభ్యులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎమ్మార్సీలు హాజరు కావాలని ఆయన కోరారు.

కోటి సంతకాల సేకరణ

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోట క్రాస్‌రోడ్డులో మంగళవారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర, యువజన విభాగం నాయకులు గంపా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులకు శిక్షణ

బాలాయపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో మంగళవారం పరిశుభ్రత, పచ్చదనంపై ఎంపీడీవో నారాయణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు, పచ్చదనం పెంపునకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఏవో వినీల్‌కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

చిల్లకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో అజిత్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రీన్ విలేజ్, థీమ్-5 క్లీన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాసులు, అల్లీహుస్సేన్, నాగూరయ్య, రాజా, సర్పంచులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

పెళ్లకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం నాయుడుపేట శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగే అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, టీడీపీ ఇన్‌చార్జి, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సూళ్లూరుపేట విద్యార్థిని ప్రతిభ



తైక్వాండోలో కాంస్య పతక విజేత పర్ణికతో కోచ్‌లు ప్రభ, పవన్‌కుమార్

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సూళ్లూరుపేటకు చెందిన విద్యార్థిని పర్ణిక సత్తాచాటిందని మాస్టర్లు ఎస్.ప్రభ, పవన్ కుమార్ తెలిపారు. ఈనెల 15,16న కాకినాడలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఇందులో సూళ్లూరుపేటకు చెందిన పర్ణిక సబ్ జూనియర్ బాలికల విభాగంలో కాంస్య పతకం సాధించింది. జూనియర్ బాలుర విభాగంలో బాలవెంకట కార్తికేష్ ప్రతిభ చూపాడు. వీరిని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి భగత్, నెల్లూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షురాలు మనీషా, ప్రధాన కార్యదర్శి అఖిల్, ఉపాధ్యక్షుడు ముఖేష్ అభినందించారు.

సౌదీ బస్సు ప్రమాద మృతులకు నివాళి



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వాకాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సౌదీలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఉమ్రా యాత్రికులకు వాకాడులో ముస్లింలు నివాళులర్పించారు. స్థానిక జామియా మసీదు నుంచి బీసీ కాలనీ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక మండల అధ్యక్షుడు ఖాజా రహంతుల్లా, ప్రధాన కార్యదర్శి ఫయాజ్, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, జాయింట్ సెక్రటరీలు కాలేషా, రహీం, అక్బర్, ట్రెజరర్ జిలానీ, యస్‌దాని బాషా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాటం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశంలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వ సాధన కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఇలపా నాగేంద్ర అన్నారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లిం మైనార్టీ, దళిత, గిరిజనులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమణయ్య, శ్రీనివాసులు, ప్రభుదాస్, కోటయ్య, శీనయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు స్థానిక సంస్థల సుస్థిరావృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీలకు అందుతున్న నిధులు, వినియోగం తదితర అంశాల గురించి వివరించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్రపై ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ అవగాహన కల్పించారు.

ముసురు వాన... వణికించిన చలి



ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో కురుస్తున్న వర్షం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణం సహా మండలంలో మంగళవారం ముసురు వాన కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు జోరుగా వర్షం కురిసింది. ఆ తరువాత మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం ముసురు వాతావరణంతో చలి వణికించింది. అలాగే అడపాదడపా జల్లులు పడ్డాయి. సాయంత్రం 6నుంచి రాత్రి 9గంటల వరకు ఎడతెరపిలేని వర్షం కురిసింది. మొత్తంగా చలి తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వీధి వ్యాపారాలు మందగించాయి.

ముక్కంటి ఆలయ హౌస్ కీపింగ్ సిబ్బంది నిజాయితీ



శ్రీనివాసులు సోదరుడికి బంగారు ఉంగరాలను అందిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి సోమవారం నెల్లూరుకు చెందిన శ్రీనివాసులు వచ్చారు. ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే జ్ఞానప్రసూనాంబ అతిథిగృహం నెం.33 గదిలో బస చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన గదిని ఖాళీచేసి వెళ్లిపోయారు. మంగళవారం గదిని శుభ్రం చేసేందుకు హౌస్‌కీపింగ్ సిబ్బంది గున్నయ్య వెళ్లగా పరుపు కింద రెండు బంగారు ఉంగరాలు కనిపించాయి. వాటిని ఆయన వెంటనే ఆలయ అధికారులకు అందించాడు. ఆలయ అధికారులు శ్రీనివాసులును సంప్రదించగా తన కుమారుడి అనారోగ్యం ఉందని ఫోన్ రావడంతో బెడ్ కింద ఉన్న ఉంగరాలను మరిచిపోయినట్టు తెలిపాడు. తన సోదరుడికి అందజేయాలని కోరారు. ఈ మేరకు స్థానిక అవుట్‌పోస్టు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, ప్రోటోకాల్ ఏఈవో మోహన్, ఏపీఆర్వో సమక్షంలో ఆయన సోదరుడికి ఆ రెండు బంగారు ఉంగరాలను అందజేశారు. గున్నయ్యను పలువురు అభినందించారు. కాగా బంగారు ఉంగరాల విలువ కింద రూ.1.60 లక్షలు ఉంటుందని అధికారులు చెప్పారు.

23న మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠ



రాతి మండపం వద్ద పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గురువే దైవం అన్న సూక్తులను వ్యాసాశ్రమంలో చదువుకున్న పూర్వవిద్యార్థులు నమ్మి, గురువు ఇచ్చిన జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి పూనుకున్నారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు సద్గురు మలయాళస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి పూనుకున్నారు. ఈ నెల 23న ఏర్పేడులో ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించి రాతి శిలామండపాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 22న మలయాళస్వామి విగ్రహాన్ని ఏర్పేడు, బాల కృష్ణాపురం, ఆమందూరు, సీతారాంపేటల్లో ఊరేగిస్తారు. 23న ఆదివారం ఉదయం 8 నుంచి 10గంటల లోపు వేదపారాయణం, గణపతిపూజ, వాస్తుపూజ, కలిశపూజ, వాస్తు శాంతి హోమం, స్వస్తివాచనం, గణపతి, గురు పూజ హోమాలు నిర్వహిస్తారు. ఎమ్మెల్యే సుధీర్ చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు.

పుస్తకాలు పట్టుకునే వయసులో పుస్తెలొద్దు

సత్యవేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు పుస్తకాలు పట్టుకుని బడికి వెళ్లాల్సిన వయసులో పెళ్లిళ్ల పేరుతో చదువులకు దూరం చేసి భవిష్యత్తును అంధకారం చేయడం సరికాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి అన్నారు. బాల్య వివాహాలపై మంగళవారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ల నిండక ముందే వివాహాలు చేయడం వల్ల 19 ఏళ్లలోపే ఎక్కువ మంది గర్భం దాల్చుతున్నారన్నారు. దీంతో శారీరక, మానసిక సమస్యలు వస్తున్నాయన్నారు. రక్తహీనతతో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రిన్సిపాల్ ప్రసూన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని అంగనవాడీ సూపర్‌వైజర్ యమున చెప్పారు. బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లింగ వివక్ష, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, విద్య, ఆహారం, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం రమణయ్య, సూపర్‌వైజర్ జ్యోతి, మహిళా పోలీసు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం

వరదయ్యపాళెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ వరదయ్యపాళెం మండల కార్యవర్గాన్ని యూనియన్ రాష్ట్ర నాయకులు యువశ్రీమురళి, పోలూరు జగన్నాథం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మల్లం మోహిద్దీన్, అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా పి.సూరిబాబు, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

నేటి నదీ హారతులకు ముమ్మర ఏర్పాట్లు

నిండుగా ప్రవహిస్తున్న స్వర్ణమ్మ









శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఈనెల 19న బుధవారం రాత్రి జరగనున్న స్వర్ణముఖి నది హారతుల మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ముక్కంటి ఆలయం పక్కనే స్వర్ణముఖి నదిలో గంగ హారతుల కోసం వారం రోజుల ముందు నుంచే అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. విశేషంగా విద్యుత్ అలంకరణలతో హారతులు సమర్పించే ప్రాంతాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. దీంతో మంగళవారం రాత్రి నుంచే నదీహారతుల సందడి నెలకొంది.

మడుగును తలపిస్తున్న ప్రధాన రహదారి

చిత్తడిగా మారిన గ్రామీణ వీధులు



కేవీబీపురం ప్రధాన రహదారిలో నీటిలో వెళుతున్న ఆటో



కాంపాళెం తూర్పు వీధి



కంచనపుత్తూరులో...

కేవీబీపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వాన పడితే మడుగును తలపిస్తోంది. ఇప్పటికే దీనిపై స్థానికులు పలుమార్లు ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలికంగా మరమ్మతులతో చేతులు దులుపుకున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రధాన రహదారిలో నీరు నిల్వ చేరింది. మంగళవారం వాహనదారులు అవస్థలు పడ్డారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వీధులు చిత్తడిగా మారాయి. కాంపాళెం దళితవాడ, కంచనపుత్తూరు, కుక్కంబాకం, వెస్ట్‌వరత్తూరు, పార్లపల్లిల్లో ఈ పరిస్థితి తలెత్తింది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రసాభాసగా టీడీపీ సర్వసభ్య సమావేశం

అబ్బర్వర్ జోక్యంతో సద్దుమణిగిన వాగ్వాదం



సమావేశంలో టీడీపీ శ్రేణులకు సర్ది చెబుతున్న అబ్జర్వర్ సురేష్‌రాజు

పిచ్చాటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. పట్టణంలోని టీటీడీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం సత్యవేడు నియోజకవర్గ స్థాయి పార్టీ సర్వసభ్య సమావేశంలో కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు ఎంత ప్రయత్నించినప్పటికీ గలాటా ఆగలేదు. అబ్జర్వర్ సురేష్‌రాజు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. అందరినీ బయటకు పంపి ఒక్కో మండల నాయకులను లోపలికి పిలిచారు. సమస్యలను, పదవులను పేపరు మీద రాసి ఇవ్వాలని కోరారు. సమస్యలపై మాట్లాడాలనుకున్న వారిని ప్రత్యేక గదిలో పిలిపించారు. దీంతో ఒక్కో మండల నాయకులను మాత్రమే పిలిచి వారి నుంచి అర్జీలను స్వీకరించారు. వేదికపై ప్రొటోకాల్ పాటించాలని కొందరు కోరడంతో పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, అబ్జర్వర్లు సురేష్‌రాజు, రమణరెడ్డి, వెంకటేశ్వర్లు మాత్రమే వేదికపై కూర్చున్నారు. సమావేశం నుంచి బయటికి వెళ్లే సమయంలో కొందరు ఆదిమూలం నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేస్తే ఇంకొందరు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని అని నినాదాలు చేశారు. గ్రామ కమిటీలు, మండల కమిటీలు,నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు అన్యాయం జరుగుతోందంటూ ఓ వర్గం గొడవ చేసింది. పార్టీ ఆదేశాలను ధిక్కరించిన వారు సమావేశానికి రావడానికి అనర్హులని మరో వర్గం వాగ్వాదానికి దిగింది. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు, సురుటుపల్లి ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు, పార్టీ మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, రామాంజులు నాయుడు, గిరిబాబు, మాజీ ఎమ్మెల్యే హేమలత, నాయకులు గోపిరెడ్డి, మస్తాన్, సింగిల్‌విండో చైర్మన్ జయచంద్రనాయుడు, రామచంద్రరాజు, సతీష్ నాయుడు, రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టండి: సీపీఐ



అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ నాయకుల నిరసన

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలపై దాడులను అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ అధికారం చేపట్టిన 11 సంవత్సరాల్లో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. మతోన్మాద పాలన సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో కుల, జనగణన చేపట్టి వాటి ప్రతిపాదికన స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మించల శివకుమార్, గోపి, మురళి, జనార్దన్, మోహన్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రష్యా భక్తులు



శ్రీకాళహస్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళ వారం సుమారు 40మంది రష్యా భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రష్యన్ భక్తులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడి శిల్పకళ అబ్బుర పరుస్తోందన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రజానగరం విద్యార్థులు

పిచ్చాటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రజానగరం జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ హేమాద్రి తెలిపారు. అండర్-14 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభకనబరచిన 9వ తరగతి విద్యార్థి రాకేష్ వర్మ, 8వ తరగతి విద్యార్థిని చిత్ర ఈనెల 22న కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మండలంలోని కారూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మునెయ్య జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరచడంతో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పరుగు పందెం, క్రికెట్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆకాశదీపం శాస్త్రోక్తంగా వెలిగించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిరక్షణ అందరి బాధ్యత

కేవీబీపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిరక్షణ బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో మాలతి చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో మొక్కలు పెంచి సంరక్షించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి చెత్త సేకరణ బుట్టల్లో వేసేటట్టు అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కళత్తూరులో పారిశుధ్య పనులు కొలిక్కి రాలేదని త్వరలో పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో తరుణాక్షరెడ్డి, కార్యదర్శులు గోవిందస్వామి, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): బీఎన్‌కండ్రిగ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించి రీసైక్లింగ్ చేసి విక్రయించి ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. సాలిడ్ వేస్ట్, ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు. సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, రిసోర్స్ పర్సన్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాలసదనంలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలసదనంలో అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి తెలిపారు. రెండు కుక్‌పోస్టులు, హెల్పర్, హౌస్‌కీపర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్, పీటీ కం యోగా టీచర్ పోస్టుల భర్తీకి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు నెం.9000106774, 6281479303లలో సంప్రదించాలన్నారు.

సహకార వారోత్సవాలు

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు ఆవరణలో మంగళవారం అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా సహకార జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు పంచిపెట్టారు. సహకార వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ విజయకుమార్, కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు పాలకమండలి చైర్మన్ ఖాదర్‌బాషా, సభ్యులు,సీఈవో ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

గంధోత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈదులగుంటలోని మగ్దూం బాబా ఆలీషా దర్గాలో మంగళవారం గంధోత్సవాలను నిర్వహించారు. టీడీపీ నాయకులు దర్గాలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలోని సమస్యలను టీడీపీ నాయకుల దృష్టికి దర్గా నిర్వాహకులు తీసుకెళ్లారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీ, నాయకులు దొరబాబు, జహీర్ అహ్మద్, మీర్జావలి, మధుసూదనరావు, నయీమ్, నాగూరుబాషా తదితరులు పాల్గొన్నారు.

స్కిట్ మాజీ అధ్యాపకుడి మృతి

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామనగర్‌కాలనీలో నివాసం ఉండే స్కిట్ కళాశాల మాజీ అధ్యాపకుడు గున్నేరి నరసింహారెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసు కున్న ముక్కంటి ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన తల్లిదండ్రులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, యుగంధర్‌రెడ్డి, రవిచంద్ర నాయుడు, బాల తదితరులున్నారు.

కుష్ఠును పారదోలుదాం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠును అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. బీఎన్‌కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్లమాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీహెచ్‌వో వెంకటేశ్వర్లు కుష్ఠు నివారణపై అవగాహన కల్పించారు. స్పర్శ, నొప్పి, దురదలేని రాగి లేదా బంగారు వర్ణం మచ్చలు శరీరంలో ఎక్కడైన వస్తే తక్షణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆరు మాసాలు పాటు మందులు వాడితే నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్కి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోండి

వరదయ్యపాళెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్కి ఆక్రమిత అటవీ భూములను స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని భారత హేతువాదసంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య కోరారు. మంగళగిరిలో అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ చలపతిరావును మర్యాదపూర్వకంగా ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ... బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో 21 ఎకరాల అంజూరు అటవీభూమిని కల్కి స్వామి ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. రెవన్యూ అధికారులు తప్పుడు పత్రాలు తయారు చేసి అటవీ భూమిని స్వామికి కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు.